సాక్షి తిరుపతి

సోమవారం । 17 । జూలై । 2023



సామాన్య భక్తులకే ప్రాధాన్యం

తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. - 8లో



ఫుడ్ పరిశ్రమ ఎండీపై దాడి

మేనకూరు సెజ్‌లోని ఓ పరిశ్రమ యజమాని డబ్బులు ఇవ్వలేదని ఆదివారం కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. -8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



సుగంధ ద్రవ్యాలు, వస్త్రాలను తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

తిరుపతి కల్చరల్ : అలిపిరి పాదాల మండపం వద్ద ఉన్న శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. ఆణివార ఆస్థానం మహోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ డిప్యూటీ ఈఓ వీఆర్ శాంతి ఆధ్వర్యంలో తిరుమంజనం చేపట్టారు. పరిమళ భరిత పచ్చ కర్పూరం, కిచిలీ గడ్డ, పసుపు, కుంకుమ, చందనం, సుగంధ ద్రవ్యాలతో కూడిన లేపనంతో ఆలయ ప్రాంగణంలోని గోడలు, స్తంభాలు, వాకిళ్ల పరిసర ప్రాంతాలను సంప్రోక్షణ చేశారు. లక్ష్మీనారాయణ స్వామి, పాదాల మండపంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి గర్భాలయాలను పరిశుభ్రం చేశారు. అనంతరం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతలు కోలా లక్ష్మీపతి, సరోజ, పి.చంద్రకాంత్, లక్ష్మీ దంపతులు, జ్యోతి నూతన వస్త్రాలను స్వామివార్లకు, ఆలయ ఉద్యోగులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ మునికృష్ణయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీనివాసరావు, అర్చకుడు కె.మురళీకృష్ణ, అర్చక బృందం, శ్రీనివాసమూర్తి, మునికృష్ణుడు, దేవయ్య, మునిరత్నం, మహాలక్ష్మి, శ్రీరాములు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోవడంతో కృష్ణ తేజ అతిథి గృహం వరకు భక్తులు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 87,171 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,273 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 3.68 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ జేఏసీలో జిల్లా ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)లో జిల్లా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు నలుగురికి చోటు దక్కింది.ఆదివారం విజయవాడలో నిర్వహించిన జేఏసీ నూతన కమిటీలో జిల్లాకు చెందిన ఎం.శంకరయ్య (పీఆర్ డీఈ తిరుపతి)కి స్టేట్ కో–చైర్మన్‌గా, డి.గురుమూర్తి(ఇరిగేషన్ డీఈ)కి స్టేట్ కో–కన్వీనర్‌గా, బి.రామకృష్ణ (టీటీడీ సీనియర్ అసిస్టెంట్)కి స్టేట్ కో–కన్వీనర్‌గా, జీవీ సత్యనారాయణ (జూనియర్ కళాశాల లెక్చరర్)కి స్టేట్ ఈసీ మెంబర్‌గా అవకాశం దక్కింది.

30న తులసీ మహత్యం

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 30వ తేదీన తులసి మహత్యం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. స్వామివారికి తులసీ దళం అత్యంత ప్రీతికరమైంది. శ్రావణ శుద్ధ ద్వాదశినాడు తులసి ఆవిర్భవించిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా ఉదయం స్వామి వారు గరుడుని అధిరోహించి విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

తిరుమలలో నృత్యోత్సవాలు ప్రారంభం



కళాకారుల నృత్యభంగిమ

తిరుమల: తిరుమల ఆస్థాన మండపంలో ఆదివారం జాతీయస్థాయి నృత్యోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ సాయి నాట్యాంజలి ఫైన్ ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ నంద్యాల వారి ఆధ్వర్యంలో మంగళవారం వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. డాక్టర్ పల్లంశెట్టి సురేష్ మాట్లాడుతూ తిరుమలలో ఏడేళ్లుగా శ్రీవారికి నాట్యనీరాజనం సమర్పిస్తున్నామన్నా రు. నాట్య గురువులు శ్రీనివాసవరప్రసాద్ , సంధ్యాదేవి ,కీర్తన, మహేష్ ,ఐశ్వర్య రెడ్డి , రేణుక ప్రభాకర్ , నళిని, అంగుస్మన్, రీమిటాపాల్, అనితమండల్, అంకిత బాసక్,చంద్రశేఖర్ పేర్ని , సంతని బైన్ (మణిపురి) పాల్గొన్నారు.



టీడీపీలో కోల్డ్‌వార్!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ పతనావస్థకు చేరింది. నేతల సంగతి దేవుడెరుగు.. కార్యకర్తలే కనిపించని పరిస్థితి ఏర్పడింది. అయితే ఆ పార్టీ అధినేత చంద్రబాబు మాత్రం టికెట్ కోసం ఆశావహులు పోటీ పడుతున్నారనే కలరింగ్ ఇస్తున్నారు. తనను కలిసిన ప్రతి ఒక్కరికీ అభ్యర్థిత్వంపై హామీ ఇచ్చి మభ్యపెడుతున్నారు. ప్రధానంగా బొజ్జల సుధీర్‌రెడ్డి.. ఎస్సీవీ నాయుడు.. మునిరామయ్య మధ్య విభేదాలు సృష్టిస్తున్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు అరకొరగా మిగిలిన శ్రేణుల్లో సైతం ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం తమ్ముళ్ల నడుమ తకరారు పెట్టి చోద్యం చూస్తున్నారు. దీంతో ఏ నేత వెంట వెళితే ఏం ముంచుకొస్తుందో అని కార్యకర్తలు అయోమయంతో తలలు పట్టుకుంటున్నారు.

- బొజ్జల, ఎస్సీవీ, సత్రవాడ గ్రూపు రాజకీయాలు
- నేతల మధ్య విభేదాలకు ఆజ్యం పోసిన చంద్రబాబు
- ఎటువైపు వెళ్లాలో తెలియక అయోమయంలో కార్యకర్తలు
- ఇలాగైతే పార్టీలో కొనసాగలేం అంటున్న ఎస్సీవీ వర్గీయులు

సాక్షి, తిరుపతి : శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు టీడీపీలో చేరి రోజులు గడవక ముందే ఆ పార్టీలో కోల్డ్ వార్ మొదలైంది. నియోజకవర్గంలో పార్టీ ఉనికి కోసం చంద్రబాబు వేసిన ఎత్తులకు బొజ్జల, ఎస్సీవీ, సత్రవాడ బలవుతున్నారని టీడీపీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తన సొంత ప్రయోజనాల కోసం చంద్రబాబు ఆ ముగ్గురు నాయకుల మధ్య వర్గ విభేదాలు సృష్టిస్తున్నారని మండిపడుతున్నారు. శ్రీకాళహస్తిలో ఓటమి తప్పదని టీడీపీ అధినేత చంద్రబాబుకు తన సర్వేల్లో తేలిపోయింది. విషయం తెలిసినా.. బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సత్రవాడ మునిరామయ్య, ఎస్సీవీ నాయుడు నడుమ అగ్గి రాజేసి ఆజ్యం పోస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థిత్వం కోసం ఈ ముగ్గురు నేతలు పోటీపడుతున్నారని, అందుకే ఎవరినీ ఖరారు చేయకుండా మభ్యపెడుతూ వైషమ్యాలు సృష్టిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తరచూ పార్టీలు మారే నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. ఏపార్టీ అధికారంలో ఉంటే.. ఆ పార్టీ నేతలతో మంచి సంబంధాలు నెరుపుతూ.. చిన్నగా అందులోనే చేరడం ఎస్సీవీ నాయుడుకి వెన్నతో పెట్టిన విద్య. అందులో భాగంగా టీడీపీ అధికారం కోల్పోవటంతో వైఎస్సార్‌సీపీలో కొనసాగుతూ శ్రీకాళహస్తిలో చక్రం తిప్పాలని భావించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుండటంతో వ్యక్తిగతంగా తనకు ఏమాత్రం ప్రయోజనం ఉండదని భావించిన ఎస్సీవీ నాయుడు మరోసారి టీడీపీ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే.

పార్టీలో చేరక ముందు నుంచే వర్గాలు !

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేయాలనే లక్ష్యంతో టీడీపీలో చేరిన ఎస్సీవీ నాయుడు ఆరు నెలల ముందు నుంచే తమ్ముళ్లందరితో సఖ్యతగా ఉండటం ప్రారంభించారు. బొజ్జల, మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య వర్గీయులతో తరచూ మాట్లాడుతుండటం, వారిని ఇంటికి పిలిపించి ప్రత్యేకంగా మంతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే టీడీపీ అధినేత చంద్రబాబుని కూడా తరచూ కలిసేవారని విశ్వసనీయ సమాచారం. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జల సుధీర్‌రెడ్డిపై ప్రజల్లో సానుకూల దృక్పథం లేదని చంద్రబాబుకు పదే పదే చెప్పేవారని తెలిసింది. అందులో భాగంగానే ఎస్సీవీని టీడీపీలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థిగా ఎస్సీవీకి గట్టి హామీ ఇవ్వటంతోనే ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నట్లు సమాచారం. ఇదే విషయాన్ని పలు సందర్భాల్లో ఎస్సీవీ నాయుడు పరోక్షంగా చెప్పుకుంటూ వచ్చారు. పార్టీని నమ్ముకుని ఉన్న బొజ్జల సుధీర్‌రెడ్డి తనకే టికెట్ అని భావించి తన వంతు నియోజక వర్గంలో పర్యటించటం, నాయకులు, కార్యకర్తలను పిలిపించుకుని మాట్లాడటం చేస్తున్నారు. అయితే చంద్రబాబు లోపాయికారీ ఒప్పందంలో భాగంగా ఎస్సీవీ నాయుడికే టికెట్ అనే విషయం బొజ్జలకు ఆలస్యంగా తెలియటంతో పలుమార్లు సోషల్ మీడియా ద్వారా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎస్సీవీ నాయుడుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.

బస్సుయాత్రలో బయటపడిన విభేదాలు

టీడీపీ నేతలు చేపట్టిన బస్సుయాత్రలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తనకు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రస్తావించారు. చంద్రబాబు నాయుడు తనకు పొలం ఇచ్చారని, అందులో తననే సాగు చేసుకోమని చెప్పారని పరోక్షంగా తెలియజేశారు. సందర్భం లేకుండా ఎస్సీవీ నాయుడు ఎందుకు ఇటువంటి వ్యాఖ్యలు చేశారనే విషయం టీడీపీ శ్రేణులకు అర్థం కాలేదు. విషయం తెలుసుకున్న బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం ఎస్సీవీ నాయుడు వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సీవీ నాయుడు ఎందుకు అలా మాట్లాడారో తనకు తెలియదని, నేటి వరకు శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జ్ తానేనని బహిరంగంగా చెప్పుకుంటూ వస్తున్నారు. అదే విధంగా మరో వైపు మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కూడా తన వంత తాను ప్రయత్నాలు చేసుకుంటూ వస్తున్నారు. అయితే పైకి తామంతా ఒక్కటేనని, ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ కోసం పనిచేస్తామని చిలక పలుకులు వల్లిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల బొజ్జల సుధీర్‌రెడ్డి, ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య సంయుక్తంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎవరికి వారు తనకే టికెట్ అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేయడమే ఇందుకు నిదర్శనం. తాజాగా బస్సుయాత్రలోనే ఎస్సీవీ నాయుడు, ఆయన వర్గీయులకు బొజ్జల ప్రాధాన్యత ఇవ్వలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీవీ నాయుడు, ఆయన అనుచరులను బస్సులో ఎక్కనివ్వకుండా అడ్డుకున్నారే ప్రచారం జరుగుతోంది.

ఇలాగైతే కొనసాగలేం

అడుగడుగునా అవమానాలు భరిస్తూ టీడీపీలో కొనసాగలేమని ఎస్సీవీ నాయుడు ముఖ్య అనుచరుడు శివా యాదవ్ తదితరులు ఆదివారం విలేకర్ల సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీలో నిమ్న వర్గాలకు ప్రాధాన్యత లేదని మీడియా ఎదుట వాపోయారు. 'భవిష్యత్తుకు గ్యారెంటీ' బస్సు యాత్రలో పాలుపంచుకున్న తనపై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించారని శివ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎస్సీవీ నాయుడు అనుచరుడినని చెబుతున్నా వినకుండా బస్సు దిగమన్నాడని, అంతటితో ఆగకుండా కులం పేరుతో దూషిస్తూ అనుచరులతో దాడి చేయించాడని ఆరోపించారు. విజయవాడలో చంద్రబాబు నాయుడుని ఎస్సీవీ సుమారు 500 మందితో కలిశారని, అప్పుడు కూడా బొజ్జల సుధీర్‌కి టికెట్ ఇస్తామని పార్టీ అధినేత చెప్పలేదని వివరించారు. పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని మాత్రమే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. పార్టీ ఆఫీసుకి వస్తే దాడి చేస్తామని బెదిరించడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నామని, బొజ్జల సుధీర్ నుంచి తమకు ప్రాణహాని ఉందని శివ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీవీ నాయుడు వర్గం దూసుకుపోవడం సహించలేక బొజ్జల సుధీర్ రెడ్డి ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శలు చేయటం గమనార్హం.

తుస్సుమన్న బస్సు యాత్ర!

- వరదయ్యపాళెంలో వెలవెల పోయిన రచ్చబండ

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో 'భవిష్యత్తుకు గ్యారంటీ' టీడీపీ చేపట్టిన బస్సు యాత్రకు ప్రజాదరణ కరువైంది. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగ మండలం పల్లమాల నుంచి యాత్ర ప్రారంభించారు. బీఎన్‌కండ్రిగ, వేణుగోపాలపురం మీదుగా వరదయ్యపాళెంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంతో యాత్ర ముగిసింది. అయితే రచ్చబండ జనం లేక వెలవెల పోయింది. రాష్ట్ర, జిల్లాస్థాయి నేతలు పెద్ద సంఖ్యలో హాజరైనప్పటికీ వారి ఊక దంపుడు ప్రసంగాలు వినలేక జనం నెమ్మదిగా జారుకున్నారు. అంతకు ముందు వరదయ్యపాళెంలో నిర్వహించిన ర్యాలీలో సైతం పట్టుమని 100 మంది కూడా లేకపోవడం గమనార్హం. కార్యక్రమానికి హాజరైన వారిలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు హేమలత, ఎస్సీవీ నాయుడు, సుగుణమ్మ, పరసారత్నం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి హెలన్ ఉన్నారు.



వరదయ్యపాళెంలో టీడీపీ నేతల ర్యాలీ

బస్ షెల్టర్ ప్రారంభించిన మంత్రి పెద్దిరెడ్డి



బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: మండలంలోని ఇరికిపెంట బంగ్లా వద్ద డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఫౌండేషన్ (అమెరికా) వారు నిర్మించిన బస్ షెల్టర్‌ను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం రెడ్డం వెంకటరమణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మండల కన్వీనర్ గంగాధరం, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు వేముల హరినాథ్, సర్పంచ్ రెడ్డెప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, నేతలు నాగభూషణం రెడ్డి, మిద్దింటి శంకరనారాయణ, ఝాన్సీలక్ష్మి, ఓబులంపల్లె గాంధీ, ప్రభాకర, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

అ'పూర్వ'ం.. ఆనందం..!

- 42 ఏళ్ల ఆత్మీయ బంధం
- తిరుపతి వెటర్నరీ కళాశాలలో కలిసిన 1981 బ్యాచ్ విద్యార్థులు
- ప్రత్యేక అకర్షణగా ఏపీ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి



చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డిని సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు, వెటర్నరీ వర్సిటీ వీసీ పద్మనాభరెడ్డి

- రేయ్ మచ్చా..నువ్వు లుంగీ కట్టుకుని చేతిలో రేడియో పట్టుకుని కారిడార్‌లో వెళుతుంటే, మ్యూజిక్ పిచ్చోడు అంటే ఏడిపించిన వెంకట్ గాడిని సినీ హీరోలా ఎగిరి తన్నిన సన్నివేశం గుర్తుందా అంటూ ఒకరు..
- స్టడీస్, ఆటలతోపాటు సంగీతం వినడం కూడా లెక్క ప్రకారం చేసే ఆ చదువుల చిన్నోడు మంచి ప్రయోజకుడు అవుతాడని ఆ రోజు నువ్వు ఏ నోటితో అన్నావో.. ఇప్పుడు నిజంగా ఆంధ్రప్రదేశ్‌కు పరిపాలన బాస్ అయ్యాడు. నిజంగా మన మిత్రుడు ఒక రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీగా ఉండటం మనందరికీ గర్వకారణమంటూ మరొకరు..
- అనాటిమీ ఎక్కడ కొంప ముంచుతుందో అని తెగ బాధపడేవాడిని, మన జవహర్‌రెడ్డి సమయానికి మెటీరియల్ ఇచ్చి బయటపడేశాడు. అందువల్లే దేశమాతకు 34 ఏళ్ల పాటు సేవ చేసే భాగ్యం కలిగిందని ఇంకొంకరు నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ఇందంతా ఆదివారం తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో జరిగింది.

తిరుపతి రూరల్ : ఎస్వీ వెటర్నరీ కళాశాల 1981–86 బ్యాచ్ బీవీఎస్సీ విద్యార్థులు దశాబ్దాల తర్వాత ఆత్మీయంగా సమావేశమయ్యారు. తమ 42 ఏళ్ల అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నాటి విద్యార్థి, నేటి ఏపీ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్‌రెడ్డి నిలిచారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా అమెరికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, కెనడా, జర్మనీ, చైనా దేశాల నుంచి కూడా పూర్వ విద్యార్థులు తరలివచ్చారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన గురువులను సత్కరించుకున్నారు. తమ స్నేహితుడు రాష్ట్రస్థాయిలో అత్యున్నత పదవిని అధిష్ఠించినందుకు సంబరపడ్డారు. నాటి మధుర స్మృతులను తమ పిల్లలు, మనుమళ్లు, మనుమరాళ్లు, బంధుమిత్రులతో పంచుకున్నారు. దీంతో వెటర్నరీ కళాశాల ప్రాంగణం సందడి సందడిగా మారింది. అనంతరం గోశాలలో ఐవీయఫ్ పద్ధతిలో నూతనంగా జన్మించిన సరోగసి సాహివాల్ దూడలను, సమీకృత దాణా మిక్సింగ్ ప్లాంట్‌ను సందర్శించారు.



సిద్ధమవుతున ఆణివార ఆస్థాన వేదిక

ఆణివార ఆస్థాన ముస్తాబు

తిరుమల: సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినానికి శ్రీవారి ఆలయం ముస్తాబయ్యింది. సోమవారం ఉదయం బంగారువాకిలి ముందు ఘంటా మండపంలో ఉభయదేవేరుల సమేతంగా మలయప్పస్వామివారు గరుత్మంతుడికి అభిముఖంగా, మరో పీఠంపై స్వామివారి విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేయనున్నారు. ఈ ఉత్సవమూర్తులతో పాటు ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, ప్రసాదాలు నివేదించనున్నారు.

జియ్యంగార్ల వస్త్ర సమర్పణ

తిరుమల పెద జియ్యర్ స్వామి వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేస్తారు. వీటిలో నాలుగింటిని మూలమూర్తికి అలంకరిస్తారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాద వస్త్రంతో 'పరివట్టం' కట్టుకొని బియ్యపు దక్షిణ స్వీకరించి నిత్యైశ్వర్యోభవ అని స్వామిని ఆశీర్వదిస్తారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు పుష్పపల్లకీపై ఊరేగుతూ భక్తులకు కనువిందు చేయనున్నారు.





ప్రాంగణాన్ని విశేషంగా అలంకరిస్తున్న ఉద్యాన విభాగ సిబ్బంది

తక్కువ ధరకే బియ్యం.. కందిపప్పు!

తిరుపతి అర్బన్ : రైతుబజారులో మార్కెట్ కంటే తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నట్లు జేసీ డీకే బాలాజీ తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లాలోని రైతు బజార్లలో పౌరసరఫరాలశాఖ అధికారులు 14 బియ్యం కౌంటర్లు, 55 కందిపప్పు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆయా కౌంటర్లలో రూ.44లకు కేజీ బియ్యం. రూ.145లకు కేజీ కందిపప్పు విక్రయిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు

పలమనేరు: మండలంలోని సాకేవూరులో ఆదివారం సరస్వతి ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. అగ్ని మాపక వాహనం వచ్చి మంటలను అదుపు చేసింది. ఈ ప్రమాదంలో గాయపడిన సరస్వతిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించినట్లు అగ్నిమాపక సిబ్బంది, 108 సిబ్బంది తెలిపారు. ఇంట్లోని రూ.పదివేల విలువైన పరికరాలకు నష్టం వాటిల్లింది.

కర్ణాటక మద్యం స్వాధీనం

కుప్పంరూరల్: కుప్పం మండలం, విజలాపురం వద్ద జరిపిన దాడుల్లో 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు కుప్పం సెబ్ సీఐ కిశోర్‌కుమార్ చెప్పారు. ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా, ఓమినీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందు 384 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని, రామకుప్పం మండలానికి చెందిన బాలచంద్రను అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ రామమ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

తిరుమల : శ్రీవారి దర్శనార్థం విచ్చేసే సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నట్లు టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఆదివారం తిరుమల అన్నమయ్య భవన్‌లో నిర్వహించిన డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ నాదనీరాజనం వేదికపై ఈ నెల 3వ తేదీ నుంచి శ్రీమద్భాగవత ప్రవచనం సాగుతోందన్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తోందని వెల్లడించారు. శ్రీ కుప్పా విశ్వనాథశర్మ చేపట్టిన ప్రవచనానికి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం భక్తులతో ఫోన్‌లో మాట్లాడారు..



డయల్ యువర్ ఈఓలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

- **ప్రవీణ్ కుమార్, మహారాష్ట్ర :** అంగప్రదక్షిణ టోకెన్లను ఆఫ్‌లైన్‌లో కూడా ఇవ్వండి.
  ఈఓ : భక్తుల సౌకర్యార్థమే ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు జారీ చేస్తున్నాం.
- **స్వామి, అనంతపురం :** శ్రీవారి సేవకు వచ్చాం. ఫోన్ నంబర్ మార్చాలని విజ్ఞప్తి చేశాం. అయితే కొత్త నంబర్ నమోదు చేసుకోవడం వీలుకావడం లేదు.
  ఈఓ : తప్పకుండా మారుస్తాం.
- **శంకర్ గౌడ్, హైదరాబాద్ :** 3 నెలల ముందుగా రూ.300 దర్శన టికెట్లు విడుదల చేస్తున్నారు. మహిళలకు ఇబ్బందిగా ఉంటుంది. ఒక నెల ముందు మాత్రమే విడుదల చేస్తే బావుంటుంది.
  ఈఓ : ఎక్కువమంది భక్తుల కోరిక మేరకు 3 నెలల ముందుగా రూ.300 దర్శన టికెట్లు విడుదల చేస్తున్నాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలలకు సంబంధించి 4 వేల టికెట్లను అదనంగా విడుదల చేస్తాం.
- **దుర్గాప్రసాద్, అనకాపల్లి :** లక్కీ డిప్‌లో ఆర్జిత సేవా టికెట్లు దొరకడం లేదు.
  ఈఓ : లక్కీ డిప్‌లో ఆర్జిత సేవా టికెట్లు తక్కువగా ఉన్నాయి. స్వామివారిని ప్రార్థించి ప్రయత్నించండి.
- **హరి, మంచిర్యాల :** సీనియర్ సిటిజన్లకు కాటేజీల్లో గ్రౌండ్ ఫ్లోర్ వచ్చేలా చూడండి.
  ఈఓ : రిసెప్షన్ అధికారులకు ఈ మేరకు ఆదేశాలిస్తాం.
- **మనోహర్, జగిత్యాల :** తలనీలాలు సమర్పించే ప్రాంతంలో క్షురకులు డబ్బులు అడగకుండా కంట్రోల్ చేయండి.
  ఈఓ : భక్తులు ఎవరూ డబ్బులు ఇవ్వకపోతేనే సమస్య పరిష్కారం అవుతుంది. క్షురకులు డబ్బులు తీసుకుంటున్నట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. వారికి తరచూ కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం.
- **కర్నూలు, రతీదేవి :** శ్రీవారి సేవకులకు సేవాసదన్‌లో అన్నప్రసాదాలు అందించండి.
  ఈఓ : శ్రీవారి సేవకుల కోసం వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ప్రత్యేకంగా హాలు కేటాయించాం. సేవాసదన్‌లో కూడా అన్న ప్రసాదాలు అందించే విషయాన్ని పరిశీలిస్తాం.
- **రవికుమార్, బెంగళూరు,** సుహాసిని, నంద్యాల : బంగారు వాకిలి వద్ద టీటీడీ సిబ్బంది భక్తులను లాగేస్తున్నారు. భక్తులకు ఇబ్బందిగా ఉంది.
  ఈఓ : భక్తులందరికీ సంతృప్తికరంగా దర్శన భాగ్యం కల్పించేందుకు మహద్వారం నుంచి గర్భాలయం వరకు ఒకే వరుస విధానాన్ని అమలు చేస్తున్నాం.
- **రెడ్డి, రాయచోటి :** తిరుపతి రైల్వే స్టేషన్, విష్ణునివాసం వద్ద భిక్షకులు, అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉంది. విష్ణునివాసంలో ఎస్ఎస్‌డీ టోకెన్లకు సంబంధించి సూచిక బోర్డు లేదు.
  ఈఓ : రైల్వే స్టేషన్, విష్ణు నివాసం ప్రాంతాల్లో భిక్షకులు, అపరిచిత వ్యక్తుల సంచారంపై జిల్లా యంత్రాంగానికి తెలియజేస్తాం. విష్ణు నివాసంలో ఎస్ఎస్‌డీ టోకెన్లకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయిస్తాం.
- **మణికంఠ, పలమనేరు :** లడ్డూ కౌంటర్ వద్దకు కుటుంబ సభ్యులందరూ వెళితేనే లడ్డూలు ఇస్తున్నారు. లేకపోతే ఇవ్వడం లేదు.
  ఈఓ : దళారులను అరికట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. భక్తులు సహకరించగలరు.
- **మునిలక్ష్మి, నెల్లూరు :** ఆర్జిత సేవలు, వర్చువల్ సేవలు ఒకేరోజు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నారు. దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. వేర్వేరు రోజుల్లో విడుదల చేస్తే సౌకర్యంగా ఉంటుంది.
  ఈవో: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.
- **శ్రీరామ్, విశాఖ :** వికలాంగులు, వృద్ధులను ఒకేసారి కాకుండా వేర్వేరుగా దర్శనానికి పంపితే బావుంటుంది.
  ఈవో : అలాగే పంపుతాం.
- **హనుమంతరావు, గుంటూరు :** తిరుమలలో గది తీసుకున్నాం. డిపాజిట్ రీఫండ్ రాలేదు.
  ఈఓ : మీకు ఫోన్ చేసి రీఫండ్ వివరాలు తెలియజేస్తాం.
- **వేణుగోపాల్, హైదరాబాద్ :** ఎస్వీబీసీ తెలుగు ఛానల్‌లో ఇతర భాషల కార్యక్రమాలను నిలుపుదల చేయండి.
  ఈఓ : భక్తులకు సౌకర్యంగా ఉండేలా కార్యక్రమాలు ప్రసారం చేస్తాం.
- **రాజు, వనపర్తి :** శ్రీవారి మెట్టు మార్గంలో లగేజ్ డిపాజిట్ చేసి నడిచి వచ్చాం. తిరుమలలో తిరిగి తీసుకోవడం ఇబ్బందిగా మారింది.
  ఈఓ : లగేజ్ కలెక్షన్, డెలివరీ సిస్టం పేరుతో నూతన వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. ఈ వ్యవస్థలో క్యూఆర్ కోడ్ స్లిప్ జారీ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా లగేజీ అందజేస్తాం.
- **ఈశ్వర్ ప్రసాద్, ఐరాల :** శ్రీవారి మెట్టు మార్గంలో అల్పాహారం కోసం దుకాణాల వద్ద అధిక ధరలు వసూలు చేస్తున్నారు.
  ఈఓ : అధిక ధరలు వసూలు చేస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. శ్రీవారి మెట్టు మార్గం మొదట్లోనే అన్నప్రసాదాలు అందించేందుకు చర్యలు తీసుకుంటాం.
- **మధు కులకర్ణి, కర్ణాటక :** తిరుమలలో గదులు పొందిన భక్తులు మరో రెండు రోజులు పొడిగించుకునే అవకాశం కల్పించండి.
  ఈఓ : తిరుమలలో గదుల లభ్యత పరిమితంగా ఉంది. ఎక్కువమంది భక్తులకు అవకాశం కల్పించాలి కాబట్టి 2 రోజులు పొడిగించుకునే అవకాశం లేదు.
- **వెంకటరమణమూర్తి, హైదరాబాద్ :** ఎన్నారై భక్తురాలు దర్శన టికెట్ కోసం ప్రయత్నిస్తే ఇవ్వలేదు.
  ఈఓ : ఎన్నారైలు తమ అర్హతను చూపితే రూ.300 టికెట్ జారీచేసి స్వామివారి దర్శనం కల్పిస్తున్నాం.
- **రామిరెడ్డి, కర్నూలు :** కర్నూలులో శ్రీవారి లడ్డూలు పొందే అవకాశం కల్పించండి.
  ఈఓ : హైదరాబాదుకు లడ్డూలు తీసుకువెళ్లే వాహనం ద్వారా కర్నూలులో ప్రయోగాత్మకంగా వెయ్యి లడ్డూలతో ఈ సౌకర్యం కల్పిస్తాం.

కార్యక్రమంలో టీటీడీ జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీదేవి, అన్న ప్రసాదం ప్రత్యేకాధికారి శాస్త్రి, వీజీఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,180
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,494
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.77,600
రిటైల్ వెండి గ్రాము	రూ.79.60

గంజాయిపై ఉక్కుపాదం



వివరాలు వెల్లడిస్తున్నసీఐ ఆశీర్వాదం

వి.కోట: గంజాయి సరఫరాపై ఉక్కు పాదం మోపుతున్నట్లు సీఐ ఆశీర్వాదం తెలిపారు. ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజులుగా నాలుగు కేసులు నమోదు చేసి 16 కేజీల గంజాయిని సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి విక్రేతలను అరెస్ట్ చేశామని పేర్కొన్నారు. శనివారం మండలంలోని కుదవగడ్డ సరిహద్దు ప్రాంతంలోని నాయకనేరి వద్ద వాహనాల తనిఖీ సమయంలో రెండు ద్విచక్ర వాహనాల్లో తరలిస్తున్న 5కిలోల గంజాని స్వాధీనం చేసుకున్నామని, తమిళనాడుకు చెందిన సుబ్రమణ్యం, రెహ్మాన్ ,ఇమ్రాన్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే ఆదివారం మండలంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలో నాకాబంది నిర్వహిస్తుండగా తమిళనాడు నుంచి కర్ణాటక అక్రమంగా చౌక బియ్యం తరలిస్తున్న మినీలారీని పట్టుకున్నట్లు తెలిపారు. 50 బియ్యం బస్తాలను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డబ్బులివ్వలేదని ఫుడ్ పరిశ్రమ ఎండీపై దాడి



దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

నాయుడుపేటటౌన్: డబ్బులివ్వలేదని మేనకూరు సెజ్‌పరిధిలోని ఓ ఫుడ్ పరిశ్రమ ఎండీపై కొంత మంది యువకులు దాడికి పాల్పడిన ఘటన ఆదివారం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల కథనం.. మేనకూరు సమీపంలో శ్రీలక్ష్మీ శ్రీనివాస ఫుడ్ ప్రొడక్ట్ పరిశ్రమ ఉంది. ఇక్కడి నుంచి తినుబండారాలు తయారు చేసి వివిధ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పరిశ్రమ ఎండీ శశిధర్‌నాయుడు నగదు తీసుకుని స్కార్పియో కారులో నాయుడుపేటకు బయలుదేరారు. మార్గ మధ్యంలో మేనకూరు సమీపంలోని ఎన్టీఆర్ కాలనీ, కోనేటి రాజుపాళెం గ్రామాలకు చెందిన కొంతమంది యువకులు కారును అడ్డగించి నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో శశిధర్ ఒప్పుకోలేదు. ఆగ్రహించిన యువకులు మూకుమ్మడిగా శశిధర్‌పై దాడికి తెగబడ్డారు. కారులో కూర్చుని డోర్లు లాక్ చేసుకున్నా వదల్లేదు. కారు అద్దాలను సైతం పగులగొట్టారు. యువకులకు అడ్డుకున్న పరిశ్రమలో పనిచేస్తున్న బాలకృష్ణ, తిరుబాతో పాటు ఎండీ శశిధర్‌పై విక్షణారహితంగా దాడిచేశారు. సమాచారం తెలుసుకున్న పరిశ్రమలో పనిచేస్తున్న కొంతమంది అక్కడికి చేరుకోవడంతో యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు పరిశ్రమ ఎండీ శశిధర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన ముగ్గురినీ నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరి మృతి



ప్రమాద స్థలంలో గుర్తు తెలియని యువకుల మృతదేహాలు

గూడూరు రూరల్: గూడూరు రూరల్ పరిధిలోని ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని సుమారు 25 సంవత్సరాల వయస్సు గల ఇద్దరు గుర్తుతెలియని యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. నెల్లూరు నుంచి ద్విచక్ర వాహనంలో గూడూరు వైపు వస్తుండగా.. అదే మార్గంలో గుర్తుతెలియని లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టగా మృతుల వద్ద ఆధారాలు లభించలేదు. మృతదేహాలను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

రెండు తలల దూడ జననం

కుప్పంరూరల్: రెండు తలలతో దూడ జన్మించిన సంఘటన కుప్పం మండలం, వేపనపల్లెలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. కనకరాజుకు చెందిన ఆవుకు నొప్పులు ప్రారంభమయ్యాయి. కనకరాజు, స్థానికులు ఆవు నుంచి దూడను లాగేందుకు ప్రయత్నించారు. అయితే మొదటి తల, ముందరికాళ్లు రావాల్సి ఉండగా, ఈ ఆవుకు మాత్రం మొదటి వెనుకటి కాళ్లు వచ్చాయి. లోపల ఉన్న రెండు తలలను గమనించని స్థానికులు దూడను బయటికి లాగారు. దూడకు రెండు తలలు ఉండడంతో ఆశ్చర్యానికి గుర య్యారు. అయితే అప్పటికే దూడ మృతి చెందింది. ఆవు పరిస్థితి విషమంగా ఉంది.

రెండు బైక్‌లు ఢీ

నాయుడుపేట టౌన్: పట్టణ పరిధిలోని మునిరత్నం నగర్ వద్ద రహదారిపై శనివారం రాత్రి రెండు బైక్‌లు ఢీ కొన్న ప్రమాదంలో ముని అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం.. మునిరత్నం నగర్‌కు చెందిన ముని బైక్‌లో నాయుడుపేటకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. మునిరతన్నం నగర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్ మునివస్తున్న బైక్‌ను ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన మునిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ

– నలుగురికి గాయాలు

రాపూరు: రాపూరు కొయ్య మిల్లు సమీపంలో ఆదివారం సాయంత్రం రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో వాహనాల్లో వెళ్తున్న నలుగురికి గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మద్దెలమడుగు నుంచి రాపూరు వస్తున్న మోటార్ సైకిల్ కోటూరుపాడు వైపు వస్తున్న మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చిల్లకూరు మండలం, చింతవరానికి చెందిన గణేష్, తేజ, డక్కిలి మండలం, పోలుగోడుకు చెందిన సుధీర్, రాపూరు మండలం, ఏపూరుకు చెందిన సమరకు గాయాలయ్యాయి. రాపూరు 108 సిబ్బంది సంఘనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గూడూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ తెలిపారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్

పారిశుద్ధ్య కార్మికుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: కట్టమంచి వినాయకుడి వీధికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఈశ్వర్ (29) ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆదివారం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో తాళలేక ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

రామకుప్పం: మండలంలోని ఆనిగానూరుకు చెందిన బాలికను అపహరించి, అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడు, కుప్పం మండలం వేపూరుకు చెందిన చంద్రశేఖర్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట కిడ్నాప్ కేసును నమోదు చేసిన పోలీసులు బాలిక ఇచ్చిన వాంగ్మూలం మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం చంద్రశేఖర్ మల్లానూరు సమీపంలో ఉన్నట్లు సమాచారం అందుకున్న అర్బన్ సీఐ శ్రీధర్ సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. నిందితుడిని కుప్పం కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.